సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 15 । మార్చి । 2024



మహిళల అభివృద్ధే ధ్యేయం

పాయకరావుపేటలో చేయూత పథకం లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు బాబూరావు, కంబాల జోగులు పాల్గొన్నారు. 10లో



'ప్రగతి పథంలో ఏయూ'

విశాఖ: విదేశీ వర్సిటీలతో సమానంగా ఏయూ ప్రగతి సాధిస్తోందని లండన్‌లో స్థిరపడిన కామేష్ చాడ అన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
అనకాపల్లి	6.10	4.52
నర్సీపట్నం	6.13	4.49

టీడీపీలో సెగలు

- సీటు రాకపోవడంపై సీనియర్లు గరం గరం
- భోరుమంటున్న బండారు, ఇంటికే పరిమితం
- రాజీనామా చేస్తున్నట్టు గండి బాబ్జీ లీకులు
- భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో సమావేశమైన గంటా
- మాడుగులలో పి.వి.జి.కుమార్, గవిరెడ్డి మండిపాటు
- ఎన్నికల బరిలో ఉంటానంటున్న ప్రగడ
- ముఖం చాటేస్తున్న అనకాపల్లి టీడీపీ నేతలు
- నేడు బలప్రదర్శనకు గిడ్డి ఈశ్వరి సన్నాహాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

టికెట్ల ప్రకటనపై టీడీపీలో నిరసన సెగలు ఎగసిపడుతున్నాయి. అసంతృప్త నేతలు తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. అధినేత తీరుపై ధ్వజమెత్తుతున్నారు. చంద్రబాబు తమను నమ్మించి గొంతుకోశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొత్తు నేపథ్యంలో పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన తమను కాదని ఆ సీట్లను బీజేపీ, జనసేనకు కేటాయించడంపై పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. విశాఖ దక్షిణం, ఉత్తరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి, పాడేరు నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు అధినేత చంద్రబాబు వ్యవహారశైలిపై మండిపడుతున్నారు. కేవలం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే ఏకంగా పొత్తులో ఆరు సీట్లను కేటాయించడం ఏమిటని వాపోతున్నారు. పార్టీ అధినేత వ్యవహారశైలిపై బండారు భోరుమంటుండగా... బాబ్జీ తన సీటుకు 'గండి'పడటంపై మండిపడుతున్నారు. ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తున్నారనే వదంతులు వెలువడ్డాయి. **ఇక గంటాకు భీమిలి ఇచ్చేది లేదు.. చీపురుపల్లి వెళ్లాలని హుకుం జారీ చేయడంతో.. తన సీటు కోసం చంద్రబాబు మెడలో గంట కట్టేందుకు నారాయణ....నారాయణ అని తిరుగుతున్నారు. తాజాగా** తన అనుచరులతో భవిష్యత్ కార్యాచరణపై గంటా భేటీ అయ్యారు. అవకాశం ఉంటే భీమిలి నుంచి పోటీ చేయాలని, లేదంటే ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని సన్నిహితులు సూచించినట్టు సమాచారం. ఇక యలమంచిలిలో ఇప్పటికే పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ విరిగిపోగా.. అనకాపల్లిలో లోలోపల అగ్గి రాజుకుంటోంది. మరోవైపు ఏజెన్సీలోని పాడేరు నియోజకవర్గాన్ని బీజేపీకి ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. మొత్తంగా తెలుగుదేశం పార్టీని విశాఖ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నమ్ముకుంటే నట్టేట ముంచారు...!

వాస్తవానికి గత ఎన్నికల్లో నగరంలో నాలుగు సీట్లనూ తెలుగుదేశం పార్టీ గెలుపొందింది. ఇప్పుడు పొత్తులో భాగంగా ఇందులో రెండు సీట్లను జనసేన, బీజేపీకి కేటాయించారు. పార్టీకి దక్షిణ నియోజకవర్గంలో ఎవరూ దిక్కు లేని సమయంలో తనకు పగ్గాలు అప్పగించి.. తీరా ఎన్నికల ముందు జనసేనకు ఇవ్వడాన్ని గండి బాబ్జీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక విశాఖ ఉత్తరాన్ని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజు పార్టీ నేతలను ఇబ్బంది పెట్టిన విషయాన్ని పదే పదే గుర్తుచేసినా.. తిరిగి ఆయనకే సీటు ఇవ్వడం ఏమిటని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇక పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణను కనీసం పట్టించుకోకపోవడాన్ని ఆయన వర్గీయులు తప్పుపడుతున్నారు. మొదటి నుంచీ పార్టీలో ఉన్న సీనియర్ నేతను గౌరవించే పద్ధతి ఇదేనా అని వాపోతున్నారు. యలమంచిలిలో పార్టీ జెండాను ఎవరూ మోసేందుకు సిద్ధంగా లేని పరిస్థితుల్లో అండగా ఉన్న ప్రగడ నాగేశ్వరరావును కనీసం సంప్రదించకుండా జనసేనకు సీటును కేటాయించారు. అనకాపల్లిలో గ్రామగ్రామాన పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన పీలా గోవింద్‌ను కనీసం పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాడేరులోనూ గిడ్డి ఈశ్వరి.... పార్టీ మారివచ్చినందుకు తనకు మంచిగా గడ్డి పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా నేతలందరూ పార్టీని నమ్ముకుంటే చంద్రబాబు నట్టేట ముంచారని వాపోతున్నారు.

అన్ని చోట్లా అదే తీరు..!

- తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారిని, నమ్ముకున్న వారిని నట్టేట ముంచారంటూ చంద్రబాబు వైఖరిపై మండిపడుతున్నారు.
- ఇప్పటికే గండి బాబ్జీ రాజీనామా అస్త్రాన్ని ఎక్కుపెట్టినట్టు తెలుస్తోంది. తనకు ఎక్కడో ఒక చోట సీటు ఇవ్వకపోతే తెలుగుదేశం పార్టీలో కొనసాగేదిలేదని ఆయన అనుచరులతో స్పష్టం చేసినట్టు సమాచారం.
- గంటా శ్రీనివాసరావు కూడా తన అనుచరులతో సమావేశమై... భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. చీపురుపల్లి నుంచి పోటీ చేసేదిలేదని... భీమిలి ఇస్తే ఓకే లేదంటే ఏమి చేద్దామనే అంశంపై అనుచరుల అభిప్రాయాలను సేకరించినట్టు తెలుస్తోంది.
- విశాఖ ఉత్తరంలో బీజేపీ నుంచి పోటీ చేయనున్న విష్ణుకుమార్‌రాజుకు టీడీపీ కేడర్ ఎక్కడా సహకరించడం లేదు.
- పెందుర్తిలో బండారు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటిపట్టునే ఉండి కనీసం బయటకు వచ్చి మోహం చూపించేందుకు కూడా ఆయన ఇష్టపడలేనంతగా లోలోపల రగిలిపోతున్నట్టు తెలుస్తోంది.
- యలమంచిలిలో జనసేన నుంచి పోటీలో ఉండనున్న సుందరపు విజయకుమార్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును కలవగా.. మద్దతిచ్చేది లేదని, తానూ బరిలో ఉంటానని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.
- అనకాపల్లిలో కొణతాలపై లోలోపల కత్తులు నూరుతున్నారు. పీలా వర్గీయులతో పాటు దాడి వర్గీయులు కూడా కొణతాలకు సహకరించేది లేదని పేర్కొంటున్నారు.
- మాడుగుల టీడీపీ ఇన్‌చార్జి పి.వి.జి.కుమార్ కె.కోటపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అసంతృప్తిని వ్యక్తం చేశారు. తనకు సీటు రాకపోవడంపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చీడికాడలో పార్టీ నేతలతో సమావేశమై ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడితే అధినేత భలే బుద్ధిచెప్పారని వాపోయారు.
- ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీలో అసంతృప్తి సెగలు కమ్ముకుంటున్నాయి. రానున్న రోజుల్లో ఎండవేడిమికి మించి ఈ సెగలు పెరిగి.. పార్టీలో అగ్గిరాజేసి విజయావకాశాలను నిలువునా కాల్చేసే పరిస్థితులున్నాయని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

రేసులో ఉన్నా..

- సుందరపు విజయకుమార్‌కు ప్రగడ షాక్

అచ్యుతాపురం: యలమంచిలి టీడీపీ సీటు దక్కించుకున్న జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును కలిశారు. తనకు సహకరించాలని కోరారు. అయితే తాను రేసులో ఉన్నానని, చంద్రబాబు నుంచి తనకు ఎటువంటి సూచనలు రాలేదని విజయ్‌కుమార్‌కు ప్రగడ షాకిచ్చారు. దీంతో సుందరపు విజయ్‌కుమార్ కంగుతిన్నారు. తన భవిష్యత్ కార్యాచరణపై ప్రగడ ఈనెల 15న యలమంచిలిలోని లేపాక్షి కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీకి రాజీనామా చేస్తారా.. అధిష్టానానికి సహాయ నిరాకరణ చేస్తారా..? అనేది తేలాల్సి ఉంది. ఈ పరిణామాలతో యలమంచిలి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు డీలా పడిపోగా, జనసేనలో అయోమయం నెలకొంది.

అబద్ధం గెలిచింది.. నిజం ఓడింది..

- పీవీజీ కుమార్ ఆవేదన

కె.కోటపాడు: మాడుగుల టీడీపీలో అబద్ధం గెలిచి.. నిజం ఓడిందని నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కె.కోటపాడులో గురువారం తన అనుచరులతో సమావేశమైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు అందిన నివేదికలు తారుమారు అవ్వడంతోనే నిర్ణయాలు తప్పుదారి పట్టాయన్నారు. పార్టీ ఇన్‌చార్జ్‌గా రెండున్నరేళ్ల నుంచి కష్టపడ్డానని, సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించానని పేర్కొన్నారు. చీడికాడ, కె.కోటపాడు మాజీ జెడ్పీటీసీలు పి.సత్యవతి, కశిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు మాజీ మండల అధ్యక్షుడు సబ్బవరపు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడాక భవిష్యత్ కార్యాచరణ: గవిరెడ్డి

చీడికాడ: అనేక అవమానాలు భరించి, పార్టీని వెన్నంటి ఉన్నా తనకు న్యాయం జరగలేదని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం అప్పలరాజుపురంలో అనుచరులతో సమావేశమయిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2014, 2019 ఎన్నికల్లో ఓటమి చెందినా టీడీపీని వీడలేదని, ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించినా నమ్ముకొని ఉన్నానని, అయినా తనకు అన్యాయం చేశారన్నారు. కార్యకర్తలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తానని చెప్పారు.

చోడవరంలో తాతయ్యబాబు, మల్లునాయుడు ఆగ్రహం

చోడవరం: మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజును టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేస్తూ పార్టీ అధిష్టానం గురువారం ప్రకటించడంతో మిగతా ఆశావాహులు, వారి అనుయాయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. సుమారు 90 వేల ఓటర్లున్న కాపులకు టీడీపీ తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆ సామాజిక వర్గం నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోపక్క టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీని భుజాన మోసినా ఫలితం దక్కలేదని వెలమలు కూడా అసంతృప్తితో రగిలిపోతున్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా మూడేళ్లుగా పార్టీని మోసిన కాపు కులానికి చెందిన బత్తుల తాతయ్యబాబుకి టీడీపీ మొండిచెయ్యి చూపింది. ఎన్నికలకు అవసరమైన డబ్బులు కూడా సిద్ధం చేసుకున్న తాతయ్యబాబు పార్టీ నిర్ణయంతో షాక్ తిన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ వెలమ సామాజిక వర్గానికి చెందిన గూనూరు మల్లునాయుడు పరిస్థితి చెప్పనక్కరలేదు. ప్రస్తుతం టిక్కెట్టు దక్కించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజుకు మిత్రుడైన మల్లునాయుడు రెండుసార్లు రాజును ఎమ్మెల్యేగా గెలిపించడంతో కీలకపాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో టికెట్ ఆశించగా.. 2024లో అవకాశం ఇస్తామని నచ్చచెప్పారు. నమ్మకం వమ్ము కావడంతో మల్లునాయుడు రగిలిపోతున్నారు. బుజ్జగించేందుకు చంద్రబాబు ప్రయత్నించినా స్పందించలేదు.

బండారుకే టికెట్ కేటాయించాలి

- లేకపోతే రాజీనామా చేస్తాం
- హెచ్చరించిన టీడీపీ నాయకులు

పరవాడ : పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి టీడీపీ టికెట్ కేటాయించకపోవడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెందుర్తి నియోజకవర్గంలో సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావడంతో వెన్నలపాలెంలో బండారు ఇంటి వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, ఓ పర్యాయం మంత్రి పదవులు నిర్వహించిన సీనియర్ నాయకుడు బండారుకు సీటు కేటాయించకపోవడం అన్యాయమని పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పలువురు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన బండారును అధిష్టానం గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడం అన్యాయమని మండిపడ్డారు. అధిష్టానం పునరాలోచించని పక్షంలో సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ పదవులు, సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయం తీసుకునే ముందు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మడక పార్వతి అన్నారు. పెందుర్తి టీడీపీ టికెట్ బండారుకు కేటాయించపోతే ఉమ్మడి అభ్యర్థి కోసం పనిచేయమని, మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు.



బండారు ఇంటి ముందు నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

జిల్లాలో 3,664 మందికి ఈబీసీ నేస్తం లబ్ధి



ఈబీసీ నేస్తం చెక్కు నమూనాను లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాకవరపాలెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

- రూ.5 కోట్ల 49 లక్షల 60 వేల విడుదల

తుమ్మపాల: వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత కింద 3,664 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి 5 కోట్ల 49 లక్షల 60 వేల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత ఈబీసీ నేస్తం పథకం నిధులు విడుదల చేశారు. ఈ ప్రత్యక్ష కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తోపాటు అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు నమూనా మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈబీసీ నేస్తం కింద ఒక్కో మహిళకు రూ.15 వేల చొప్పున మొత్తం మూడు విడతలకు రూ.45 వేలు అందించామన్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఈబీసీ పేద మహిళలకు మూడో విడత నిధులు తాజాగా విడుదల చేశామన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో 270 మంది లబ్ధిదారులకు రూ.40.50 లక్షలు, పాయకరావుపేట నియోజకవర్గంలో 930 మందికి రూ.139.50 లక్షలు, నర్సీపట్నం నియోజకవర్గంలో 436 మందికి రూ.65.40 లక్షలు, అనకాపల్లి నియోజకవర్గంలో 700 మందికి రూ.105 లక్షలు, చోడవరం నియోజకవర్గంలో 504 మందికి రూ.75.60 లక్షలు, యలమంచిలి నియోజకవర్గంలో 412 మందికి రూ.61.80 లక్షలు, మాడుగుల నియోజకవర్గంలో 412 మంది లబ్ధిదారులకు రూ.61.80 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి, బీసీ కార్పొరేషన్ ఏఈవో రమణమ్మ పాల్గొన్నారు.

తెలుగు జాతి ముద్దుబిడ్డ వడ్డాది పాపయ్య

- తిరుగులేని ప్రజా నాయకుడు గురునాథరావు
- విగ్రహాల ఆవిష్కరణ సభలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

కశింకోట: 'వపా'గా ప్రసిద్ధుడైన వడ్డాది పాపయ్య తెలుగు జాతి గర్వించదగిన అద్భుత చిత్రకారుడని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సహకారంతో ఏర్పాటు చేసిన వపా విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. అలాగే దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు విగ్రహాన్ని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ వడ్డాది పాపయ్య నాలుగు దశాబ్దాలకు పైగా వర్ణ సామ్రాజ్యానికి మకుటంలేని మహరాజుగా వెలుగొంది వేలాది చిత్రరత్నాలకు జీవం పోశారన్నారు. ఆయన చేతి కుంచె నుంచి జాలువారేది చిత్ర కళ కాదు సాక్షాత్తు ప్రకృతి సౌందర్యమేనన్నారు. ఇంతటి అద్భుతమైన చిత్రకారుడి గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. మాజీ మంత్రి గురునాథరావు అందించిన సేవలను ప్రస్తుతించారు. తిరుగులేని ప్రజా నాయకుడిగా గురునాథరావు చెరగని ముద్ర వేశారని ఎంపీ సత్యవతి కొనియాడారు.



కశింకోటలో ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య, దివంగత మాజీ మంత్రి గురునాథరావు విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, మలసాల భరత్

సుగర్స్ కార్మికులకు బకాయిల పంపిణీ

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన 256 మంది ఉద్యోగులు, కార్మికులకు సెటిల్‌మెంటు కింద మంజూరైన రూ.5.18 కోట్ల బకాయిల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించడం పట్ల ఉద్యోగులు, కార్మికులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జెట్టపురెడ్డితునిలో పశు వైద్య కేంద్ర భవనం, సచివాలయ భవనం, సంపద కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కలప అక్రమ రవాణా కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ప్రాంతంలో కలప అక్రమ రవాణా నివారణకు అన్ని చర్యలు తీసుకున్నామని డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన కృష్ణదేవిపేట రేంజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి కలప రవాణా నివారణకు ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. కార్పెంటర్లు తయారీ చేసి ఫర్నిచర్‌ను సీపీజీలు ద్వారానే తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణదేవిపేట రేంజర్ సుంకర వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతి రైతు వ్యాపారవేత్తగా ఎదగాలి

- 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' లో భాగంగా వ్యవసాయాధారిత ఉత్పత్తుల ఎగుమతి
- రైతు బాగుంటేనే దేశం బాగుపడుతుందని నమ్మిన సీఎం జగన్
- ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ సత్యవతి

సాక్షి, అనకాపల్లి: ప్రతి రైతూ ఒక వ్యాపారవేత్తగా అభివృద్ధి చెందాలనేదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్ష అని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి'లో భాగంగా బెల్లం, చిరుధాన్యాలు, పనస ప్రాసెసింగ్ లైన్ల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసి లాభాలార్జించేలా ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో భారత ఆహార పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంవోఎఫ్‌పీఐ) ఆధ్వర్యంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన వ్యవసాయాధారిత ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఆర్జించి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా బెల్లం, చిరుధాన్యాలు, పనస ఉత్పత్తులకు అదనపు విలువను జోడిస్తూ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా అందివ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగతం చేసుకుని ఆర్థికంగా స్థిరపడి వ్యాపారవేత్తలుగా మారినప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్న కల నిజమవుతుందన్నారు. ఆయన రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన ఏకైక సీఎం అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన స్థానం సంచాలకులు ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌ను నిర్మాణం చేపట్టం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. ఎంపీ ఆకాంక్షను రైతులందరూ నిజం చేసి వ్యాపారవేత్తలుగా మారాలని పిలుపునిచ్చారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు సిహెచ్.ముకుందరావు, కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, డి.ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

జిల్లాలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఆస్పత్రులు, పాఠశాలలు 'ఐరాడ్' యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బీఐఎస్ స్టాండర్డ్ లేని హెల్మెట్లు విక్రయించే షాపులపై కేసులు నమోదు చేయాలని పోలీసు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల వద్ద వేగనిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. హెల్మెట్ ధరించని వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానా విధించేలా తగిన సాంకేతికతను వినియోగించుకోవాలని, ముందుగా లంకెలపాలెం కూడలిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీసు, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, జిల్లా రవాణా అధికారి కె.వి.ప్రకాశరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, పోలీసు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు



సభకు హాజరైన చేయూత లబ్ధిదారులు (ఇన్‌సెట్) సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాజ్యసభకు ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. చేయూత పథకం 4వ విడత నిధులు విడుదల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో చేయూత లబ్ధిదారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో వీరు మాట్లాడారు. అమ్మ ఒడి, చేయూత, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీ, డ్వాక్రా రుణాల మంజూరు, అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం, విద్యాకానుక, విద్యాదీవెన, ఆసరా వంటి పథకాల ద్వారా మహిళలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. చేయూత పథకంలో రూ.18,750 చొప్పున నాలుగు సార్లు జమ చేయడంతో మహిళలు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, శాసన మండలిలో విప్ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ డి.వి. సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఏకమైనా సరే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించేలా అందరూ కృషి చేయాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా చంద్రబాబు నాయుడు ప్రజల్ని మోసం చేశారన్నారు. ఇప్పుడు ప్రజలు టీడీపీని, దానికి మద్దతు ఇస్తున్న పార్టీలను నమ్మడం లేదని చెప్పారు. హామీలన్నీ నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. అనంతరం 16,158 మంది చేయూత లబ్ధిదారులకు 4వ విడతగా మంజూరైన రూ.30.30 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి నాయకులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఎంపీడీవో కె.స్వప్న, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం రాజుబాబు, కరుణానిధి, డీపీఎం వరప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు సీరం నర్సింహమూర్తి, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదాయం పెరిగింది



దుకాణం నడుపుతున్న సూర్యకాంతం

అచ్యుతాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత, ఇతర పథకాలతో ఎందరో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. ఇందుకు పై చిత్రంలో ఉన్న శరగడం సూర్యాకాంతం స్వయం ఉపాధి బాట ఉదాహరణగా చెప్పవచ్చు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామానికి చెందిన శరగడం సూర్యకాంతం త్రివేణీ గ్రామైక్య సంఘంలో సభ్యురాలు. శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు కూడా. వ్యవసాయ కూలీ అయిన భర్త రాము ఆదాయం సరిపోకపోవడంతో కుమార్తె,కుమారుడిని చదివించుకునేందుకు ఇబ్బంది పడేవారు. ఈమె నెలకు రూ.50 పొదుపు కట్టడం ద్వారా గ్రూపులో ఈమె వాటాగా రూ.5 వేలు రుణం వచ్చింది. విడతల వారీగా వచ్చిన బ్యాంక్ రుణంతో సూర్యకాంతం కిరాణా దుకాణం పెట్టుకున్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి 18,750, బ్యాంక్ లింకేజీ రుణం రూ.70 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.9 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.3,600 రావడంతో కిరాణా కొట్టును జనరల్ షాపుగా మార్చుకున్నారు. ఇప్పుడు ఆమెకు నెలకు రూ.18 వేల వరకూ ఆదాయం లభిస్తోంది. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా స్థిరపడే స్థాయికి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సాయంతో అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు తప్పాయని జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటామని ఆమె చెప్పారు.

జోగుంపేటలో అగ్నిప్రమాదం

గొలుగొండ: జోగుంపేట సమీపంలో పంట పొలాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో వరికుప్ప దగ్ధం కాగా, సరుగుడు తోటకు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో జె. నారాయణకు చెందిన వరి కుప్ప కాలిపోవడంతో రూ.50 వేలు, శ్రీరాంపురం గ్రామానికి చెందిన బి.అప్పలనాయుడు సరుగుడు తోటలో కొంతభాగం దగ్ధం కావడంతో రూ.50వేల వరకు నష్టం వచ్చింది. గాలిప్రభావం అధికంగా ఉండడంతో మంటలను అదుపుచేయలేకపోయారు. జోగుంపేట రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

బూత్ కమిటీలే కీలకం



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

నక్కపల్లి: త్వరలో జరిగే ఎన్నికల్లో బూత్‌కమిటీ సభ్యులే కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయించే బాధ్యతను మీరే తీసుకోవాలని శాసన మండలిలో ప్రభుత్వ విప్, నియోజకవర్గ పరిశీలకురాలు వరుదు కల్యాణి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీజిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు అన్నారు. గురువారం నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో మండలంలో బూత్‌కమిటీలు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే అర్హత, హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉన్నాయన్నారు. ఇటువంటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని చూసి ప్రతి కార్యకర్త గర్వపడాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని చెప్పారు.

సంక్షేమ పథకాల వల్ల సగటున ప్రతి కుటుంబం సుమా రు రూ.3 నుంచి 5లక్షల వరకు లబ్ధి పొందిందన్నారు. కరోనా సంక్షోభం వచ్చినా, ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ కోర్టులను ఆశ్రయించి పథకాలను అడ్డుకోవాలని ప్రయత్నించినా, ఇతర ఎన్ని ఇబ్బందులు వచ్చినా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలియడంతో టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ, జనసేనలతో పొత్తుపెట్టుకుని వారు అడిగనన్ని సీట్లు కేటాయిస్తున్నారన్నారు. నలభైఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గెలవలేమనే భయం వెంటాడుతోందన్నారు. ప్రతి బూత్‌కమిటీ సభ్యుడు ఓటర్లను స్వయంగా కలిసి జగనన్న వల్ల జరిగిన లబ్ధిని వివరించి ఓటువేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారయణరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరంనర్సింహమూర్తి పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ ఎస్. గోవిందు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కె.హరి, సర్పంచ్‌లు రత్నకుమారి, సురేష్‌వర్మ,బార్గవ్, శ్రీను,అప్పలరాజు, నర్సింహమూర్తి, రమణ,రాజబాబు, ఎంపీటీసీలు గోవిందు, తిరుపతిరావు, కాసుబాబు, బొల్లం బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

- ఐదుగురిపై బైండోవర్ కేసులు

అనకాపల్లి: పట్టణంలో పలు లాడ్జీల్లో బుధవారం పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న రాజమహేంద్రవరం, నెల్లూరుకు చెందిన ఇమ్మంది ఇలియాజ్‌రాజ్, కె.గౌతమిరెడ్డి, ఐ.కల్యాణ ఈశ్వర్, కె.చక్రవర్తి, పటాన్ కార్తీక్‌లను అదుపులోనికి తీసుకుని విచారించినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. వారిని తహసీల్దార్ శ్రీనివాసరావు వద్ద హాజరుపరిచి, బైండోవర్ చేసినట్టు తెలిపారు.

నాసిరకం హెల్మెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద రహదారిపై ఐఎస్‌ఐ మార్కులేని నాసిరకం హెల్మెట్లు విక్రయిస్తున్న కె.అప్పన్న అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

పురుషోత్తపురంలో మూడిళ్లలో చోరీ



పురుషోత్తపురంలో చోరీ జరిగిన ఇంట్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



దొంగలు చిందరవందర చేసిన దుస్తులు



దొంగలు పగులగొట్టిన బీరువా

- ఐదు తులాల బంగారం, రూ.50వేల అపహరణ
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం

యలమంచిలి రూరల్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా వరుసగా జరుగుతున్న చోరీలు యలమంచిలి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలోని పురుషోత్తపురం ఎస్సీ కాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో తాళాలు విరగ్గొట్టి ఇళ్లలోకి చొరబడి దొరికినదంతా ఎత్తుకెళ్లారు. ఇక్కడ నివాసముంటున్న పాల్తేటి శాంతికుమారి బుధవారం రాత్రి అదే కాలనీలో తన తల్లి ఇంటికి వెళ్లి నిద్రపోయారు. తిరిగి ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూస్తే బీరువా పగులగొట్టి ఉంది. నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు 40 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించిన బాధితురాలు యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమీపంలో ఉన్న కొత్తలి చినబాబు ఇంట్లో కూడా ముప్పావుతులం బంగారం, 11వేలు నగదును దొంగలు చోరీ చేశారు. మరో ఇంట్లో లక్ష్మీదేవి వెండి బొమ్మ, రూ10వేలు నగదు దోచుకుపోయినట్టు బాధితుడు తెలిపాడు. వృత్తి రీత్యా విజయవాడకు వలస వెళ్లిన పాల్తేటి అప్పారావు ఇంట్లోకి కూడా చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు విలువైన వస్తువులు లభించకపోవడంతో వెళ్లిపోయారని గ్రామస్తులు తెలిపారు.

రంగంలోకి క్లూస్ టీం

చోరీల సమాచారం అందుకున్న క్లూస్ టీం సభ్యులు పురుషోత్తపురంలో దొంగతనాలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. నేరస్తుల వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు.

యలమంచిలి రూరల్ ఎస్‌ఐ పైలా సింహాచలం, సీఐ షేక్ గఫూర్, ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి చోరీ వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.యలమంచిలి పట్టణం,గ్రామీణంలో వరుసగా జరుగుతున్న చోరీలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- 4 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలను ప్రారంభించిన విప్ ధర్మశ్రీ



చిలకవానిపాలెంలో కుళాయిని ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

రావికమతం: ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చిలకవానిపాలెం, తట్టబంద శివారు కసిరెడ్డిపాలెం, బలిజపాలెం, బూరుగుపాలెం గ్రామాల్లో రూ.2.3 కోట్ల వ్యయంతో నిర్మించిన జల్‌జీవన్ పథకం పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైస్‌ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్సభవానిప్రసాద్, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీబీ పురం ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ



పాఠశాల్లో తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ పరిశీలకురాలు

పాయకరావుపేట: పాఠశాలల సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)లో భాగంగా సమగ్ర శిక్ష తరఫున రాష్ట్ర పరిశీలకులు మేఘ మేనాన్ గురువారం పెద రాంభద్రపురం(పీబీ పురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా పరమైన కార్యక్రమాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, టాయిలెట్ల నిర్వహణ, లింగ సమానత్వం, బాలల హక్కులు, బాలల సంరక్షణ, ప్రథమ చికిత్సపై అవగాహన తదితర అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులతో విడివిడిగా సమావేశమై వివరాలు సేకరించారు. పాఠశాలలో ఈ కార్యక్రమాల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అతితక్కువ వనరులతోనే పాఠశాలను అన్ని సౌకర్యాలతో అద్భుతంగా నిర్వహిస్తున్న తీరుకు ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావును, ఉపాధ్యాయ సిబ్బందిని, పేరెంట్స్ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మానవెల్లి అప్పారావు, రిసోర్సు పర్సన్ దొర పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్‌సభ్యుడు శంకర్ నాయక్



లోసింగ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శంకర్ నాయక్



అర్ల పంచాయతీలో వినతులు స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శంకర్ నాయక్

రోలుగుంట/రావికమతం: ఆదివాసీల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని, ఆదివాసీ గిరిజన సంక్షేమం, స్వావలంబన కోసం ఇప్పటి వరకూ 20 వేల కోట్లు ఖర్చు చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ,ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. రోలుగుంట, రావికమతం మండలాల్లో వీరు గురువారం పర్యటించారు. రోలుగుంట మండలం లోసింగి, గిరిజన పంచాయతీ అర్ల గ్రామాలలో గిరిజనులతో సమావేశమయ్యారు. లోసింగి జరిగిన సమావేశంలో పలు సమస్యలను గిరిజనులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, గ్రామంలో పాఠశాల, మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కరణం ధర్మశ్రీ, వడిత్య శంకర్ నాయక్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరామ్, గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, సహాయ కార్యదర్శి దొరబాబు, సర్పంచ్ వండల వనిత, మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి

గిరిజనుల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేశారని ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. వారు రావికమతం మండలంలోని చలిసింగం గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఆ గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, మైదాన గిరిజన గ్రామాలను ఐటీడీఏలో విలీనం చేయాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గిరిజనులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు, సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుడి హుండీ ఆదాయం రూ.1.50 లక్షలు



సూర్యనారాయణ ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలలకు గాను రూ.1,50,202 ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు, ఈవో కీర్తి ఆదినారాయణ, ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, తాడి కోటేశ్వరరావు. విజ్జపు వాసు, పాలకవర్గ సభ్యులు చంద్రకళ, విద్యాసాగర్, పిల్లా రాజు, మళ్ల గణేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న విద్యార్థులు



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో విద్యార్థులు

అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు నూకాంబిక అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు తమ స్కూల్‌కు అందించాలని అమ్మవారి పాదాల వద్ద హాల్ టికెట్లు ఉంచి ప్రార్థించారు. ప్రధానోపాధ్యాయుడు దేవరశెట్టి వెంకటేశ్వర్లు, టీచర్లు విద్యార్థులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు నూకాంబిక అమ్మవారి దర్శనాకి తీసుకెళ్లారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తల ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, హిందీ అధ్యాపకుడు మహేంద్ర పట్నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్‌మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేటజంగాలపాలెంలో గడ్డి కుప్ప దగ్ధం

అనకాపల్లి : మండలంలో వేటజంగాలపాలెం గ్రామంలో పశువులపాక, గడ్డి కుప్ప అగ్నికి ఆహుతైనట్లు స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి బి.నర్సింగరావు తెలిపారు. వేటజంగాలపాలెం గ్రామానికి చెందిన సాలాపు చంద్రరావు పొలంలో అగ్నిప్రమాదం జరిగిందని, సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,337 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,780	4,560
మొదటి రకం	3,570	4,330
రెండో రకం	3,430	3,770
మూడో రకం	3,230	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మధ్యాహ్నం)	: షిర్డిసాయి
రజాకర్	: పర్దిసాయి
వెయ్‌దరువెయ్	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-37 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 347 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- కోడూరులో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం

అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని కోడూరులో రూ.88.54 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ స్వరాజ్యం ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకనుగుణంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఆర్బీకే ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుతున్నాయన్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో వెల్నెస్ సెంటర్ల ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందిస్తూ పేదల గుండెల్లో సీఎం చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలో అన్ని సేవలు అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అమర్‌నాథ్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బోకం సరోజిని, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌రావు, ఈవోఆర్డీ ధర్మారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూకాంబిక సేవలో అమర్‌నాథ్

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త నియమితులైన సందర్భంగా గవరపాలెం నూకాంబిక అమ్మవారిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్ పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్యూ కాంప్లెక్స్ మండపానికి శంకుస్థాపన

మ్యాచింగ్ గ్రాంట్ కింద విడుదలైన రూ.1.60 కోట్లతో భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్ మండపానికి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. నూతన ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేసి భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించాలని ఆలయ వర్గాలను ఆయన ఆదేశించారు. ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే అమ్మవారి జాతర(కొత్త అమావాస్య) ఉగాది ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, రాష్ట్ర ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 80వ వార్డ్ ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, అనకాపల్లి, కశింకోట మండలాల ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, గౌరీ, పీఏసీఎస్ అధ్యక్షుడు విల్లూరి శివసూరి, సత్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీ నర్సింహారావు, ఆలయ ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, ఆదారి ఉమా శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ, కంటపల్లి శోభారాణి, మల్లవరపు ఈశ్వరరావు, పార్టీ శ్రేణులు దొండ రాంబాబు, మలసాల కిశోర్, పెద్దిశెట్టి గోవింద్, దాడి నారాయణరావు, వేగి త్రినాథ్, ఉగ్గిన అప్పారావు, మునూరు శ్రీను, రాయవరపు జోగిరాజు పాల్గొన్నారు.



క్యూకాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంత్రి అమర్‌ను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది



నూతన ఆలయ పనులను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

చైతన్యంతోనే క్షయవ్యాధి నిర్మూలన



క్షయవ్యాధి అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

అనకాపల్లి : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని హెచ్‌ఎం నీరజ అన్నారు. గవరపాలెం బాలికల హైస్కూల్ నుంచి పట్టణ పురవీధుల గుండా క్షయవ్యాధి లక్షణాలను వివరిస్తూ గురువారం విద్యార్థినులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1, 2 వారాలకు మించి దగ్గు రావడం, రెండు వారాలకు పైబడి జ్వరం ఉండడం, బరువు తగ్గడం, ఛాతీ నొప్పి రావడం, దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షలో క్షయవ్యాధి నిర్ధారణ అయిన రోగులకు రూ.500 విలువైన పోషకాహార కిట్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. దానిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



గీతాంజలి మృతికి సంతాపంగా నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: టీడీపీ-జనసేన నేతలు సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలతో మనస్థాపానికి గురై ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రార్థించారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన నేతలు అనుచిత వ్యాఖ్యలకు నిండుజీవితాన్ని బలైపోయిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, రాష్ట్ర ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమ, ఆలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, నుదురుపాటి తాతాజీ, పార్టీ శ్రేణులు పలకా రాము, పలకా సత్యనారాయణ, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో నష్టం



మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అధ్యక్షతన గురువారం బీజేపీకి వ్యతిరేకంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోదీ గాలికొదిలేశారని విమర్శించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తానని, రైతు రుణాలు మాఫీ చేస్తామన్న హామీలు ఏమయ్యాయో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం కలిగించేలా నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారని, దేశభక్తి అని చెబుతూ దేశానికి నష్టం కలిగించే చర్యలను బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రాజధాని ఢిల్లీలో రైతులు రెండేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని ఉక్కుపాదంతో కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని మండిపడ్డారు. బీజేపీకి మద్దతిస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.అప్పారావు, రైతు సంఘ నాయకులు రామ సదాశివరావు, కొరిబిల్లి శంకరరావు, సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కో కన్వీనర్ బాలుగాడి, కునిశెట్టి సురేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కోశాధికారి కాళ్ల తెలయ్యబాబు, నేతలు బొడి రాజు, వై.శివ, అజయ్, బి.నూక అప్పారావు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం

మాకవరపాలెం: సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు సర్వేశ్వరరావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మాకవరపాలెం సచివాలయంలో గురువారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో వలంటీర్లు ఎంతో కృషి చేశారన్నారు. వారే లేకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోపాటు ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. వారి సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డులను అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చింతకాయల వాసు, కోలా ఈశ్వరరావు, నారాయణమూర్తి, కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కశింకోటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించడానికి భరోసా కల్పిస్తూ కశింకోట సీఐ ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో 60 మంది సీఐఎస్‌ఎఫ్ బెటాలియన్ ఫోర్స్‌తో పోలీసులు గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కశింకోట, తీడ, తాళ్లపాలెం, బుచ్చియ్యపేట, కొత్తపల్లి, బయ్యవరం, రామన్నపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ కె.రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ యూనిట్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ



ఎస్పీ మురళీకృష్ణకు మొక్క అందిస్తున్న విజయ

అనకాపల్లి: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫింగర్ ప్రింట్ యూనిట్ ఇన్‌స్పెక్టర్‌గా టి.విజయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ సిటీ పోలీస్ ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్ఐగా పని చేస్తూ పదోన్నతిపై అనకాపల్లికి వచ్చారు. అంతకు ముందు ఎస్పీ కేవీ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

వారపు సంతలో తగ్గిన ఉల్లి ధర

కశింకోట : స్థానికంగా నిర్వహించే వారపు సంతలో గురువారం ఉల్లిపాయ ధర తగ్గింది. గత వారం కిలో రూ.25 ఉండగా, ఈ వారం రూ.20కి విక్రయాలు సాగాయి. బంగాళాదుంప రూ.25 నుంచి రూ.30కి పెరిగింది. టమాటా రూ.20, వంకాయ, దొండకాయ రూ.40, బెండకాయ, బీట్రూట్, క్యారెట్ రూ.60, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

పాండురంగ దేవస్థానం పాలక మండలి ఏర్పాటు

పాయకరావుపేట: పట్టణంలోని శ్రీ రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని ఏర్పాటు చేసినట్టు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. చైర్మన్‌గా దగ్గుపల్లి సాయిబాబా అమరేశ్వరి, డైరెక్టర్లుగా మజ్జి అప్పయ్యమ్మ, రామాల వెంకటలక్ష్మి, అల్లంకి వెంకటలక్ష్మి, చిక్కాల రామలక్ష్మి, తూములూరి పరమేశ్వరి, లావేటి సన్యాసిరావు, తలారి సుబ్బారాజు, జగతా కుమారస్వామి, యియ్యణ్ణి కృష్ణ స్వాములు నియమితులైనట్టు చెప్పారు.

గీతాంజలి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

దేవరాపల్లి: తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి డిమాండ్ చేశారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని దేవరాపల్లిలో మహిళలతో కలిసి గురువారం రాత్రి ఆమె కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, జోహార్ గీతాంజలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మీడియాకు తెలియజేయడమే నేరమన్నట్లు టీడీపీ, జనసేన మూక సోషల్ మీడియాలో వేధించి నిండు ప్రాణాన్ని బలిగొందన్నారు. తక్షణమే నీచులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల.. జగనన్నతోనే సాకారం



పార్టీలో చేరిన మహిళలతో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి సమన్వయకర్త భరత్‌కుమార్



మహిళకు పట్టా అందిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి : పేదోడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరతకుమార్ అన్నారు. జీవీఎంసీ 84వ వార్డు కోట్నివీధి 8, 9, 10, 11, 12 సచివాలయాల పరిధిలో వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో గురువారం 500 మంది అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఆయనతోనే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. తనను గెలిపిస్తే నిరుద్యోగులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకు ముందు 30 మంది మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాజుల రమేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్, పార్టీ శ్రేణులు మాధురి నాయుడు, అప్పికొండ రవిశంకర్, కోరుకొండ అప్పలసూరి, కోరుకొండ రమేష్, కోరుకొండ కన్న, పిల్లల శివ, అప్పారావు, పైడిరాజు, కేతిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

250 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



మహిళకు ఇంటి పట్టా అందిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట సీతారామ కల్యాణ మండపంలో గురువారం 5, 6 సచివాలయాల పరిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అధ్యక్షతన 250 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం పేదోడికి గూడు ఇవ్వదని, తమ ప్రభుత్వానికి అది సాధ్యమైందన్నారు.

కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 84వ వార్డ్ ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పట్టణ ఉపాధ్యక్షుడు నడిశెట్టి మధు, యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, బుద్ధ పెంటారావు, పాము సన్నిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

అనకాపల్లి: జీవీఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య వాహనాల డ్రైవర్లు డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కోన లక్ష్మణ మాట్లాడుతూ విశాఖ జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు సాయిబాబా, ఎస్ఈ కృష్ణారావు జీవీఎంసీలో వాహనాలు గత మూడు నెలలుగా మరమ్మతులు చేయమంటే చేయకుండా డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా వారిపై దుర్భాషలాడిన సాయిబాబా, కృష్ణారావు వ్యవహారశైలిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోని పక్షంలో జీవీఎంసీ పరిధిలోని అన్ని కార్యాలయాల వద్ద ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ డ్రైవర్లు, నాయకులు ఆకుల ప్రసాద్, గంజి నూకరాజు, కె.ప్రకాష్, ఈశ్వరరావు, బాషా, బొత్స ఆదినారాయణ, శ్రీను, సింగంపల్లి శ్రీను, జె.వెంకటేష్, రమణ, ఏడిద మహేష్, దొర, వాసు, కుందూరు అబ్బాస్, అప్పలస్వామినాయుడు, ఎస్.శంకర్, మాణిక్యం, ప్రాతుడు, డి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రశ్నలు అర్థం చేసుకుని పరీక్ష రాస్తే మంచి ఫలితం



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ వీడ్కోలు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కశింకోట : స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు టెన్త్ విద్యార్థుల వీడ్కోలు (ఫేర్‌వెల్) కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథి ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ పరీక్షల్లో భయం లేకుండా ప్రశ్నలను చదివి అర్థం చేసుకుని పరీక్షలు రాయాలని సూచించారు. హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావుతో పాటు ఇతర ఉపాధ్యాయులు టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు బొడ్డేడ అప్పారావు, పీఎం అప్పారావు, భీశెట్టి ఆనంద్, ఎస్‌వీజే ప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: విద్యార్థుల చదువుతోపాటు వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. ఎ.కోడూరు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు జరిగిన సిలబస్‌తోపాటు వర్కు పుస్తకాల నిర్వహణ, కరెక్షన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఐరన్ మాత్రలతోపాటు గుడ్డు, రాగి జావతోపాటు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ఈ విషయమై హెచ్‌ఎం ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులభరీతిలో అవగతమయ్యేలా బోధించాలన్నారు.

గణితానికి ఎంతో ప్రాముఖ్యం

మాకవరపాలెం: నిత్య జీవితంలో గణితానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని హెచ్‌ఎం కె.రాము అన్నారు. గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పై సింబల్‌ను ప్రదర్శించారు. అనంతరం హెచ్‌ఎం రాము మాట్లాడుతూ గణితంలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఇందులో ప్రతిభ చూపితే భవిష్యత్‌లో ఉన్నతంగా రాణిస్తారన్నారు. గణిత సూత్రాలను వేగంగా చెప్పిన విద్యార్థులు గోపాల్, మోహన్‌లను అభినందించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.